ఉమాపతిని మీరు తక్కువగా అర్థంచేసుకుంటున్నారు. అతను నాకు, మా కుటుంబానికి కావాల్సిన వ్యక్తి. అతను దగ్గర లేకుండా నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడం నాకిష్టం లేదు. కానీ, అదే సమయానికి అతనికి బ్యాంక్‌ఉద్యోగం వచ్చి కలకత్తాలో జాయిన్ కావాల్సిరావడంతో పెళ్ళి సమయానికి ఉండకుండాపోయాడు. ఒక్కమాటలో చెప్పాలంటే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటున్నానన్న ఆనందం కన్నా- అతను ఆ సమయానికి లేకపోవడం నాకు ఎంతో బాధ కలిగించింది."

శరత్‌చంద్ర నోట మాట రాలేదు.

ఏమిటీ మనిషి- తన ముందు మరో పరాయి మనిషిని పొగిడితే తను భరించగలడా? అదీ పెళ్ళి అయిన తొలిరోజుల్లో, ఒకరిపట్ల ఒకరికి పూర్తిగా అవగాహన లేని రోజుల్లో?! పడుచుజంట ఊహల్లోనికి మరోవ్యక్తి ప్రవేశిస్తే వారిద్దరి మధ్య అనురాగం ఎలా చిగురిస్తుంది? అయినా ఏమిటీ మనిషి? తన భర్త మనసెరిగి మసలుకోలేని ఈమె వింత ప్రవర్తన ఏమిటి?

ఒకసారి దశరథరామయ్య, శకుంతలమ్మ వచ్చినప్పుడు కూడా వారిమధ్య ఇదే ప్రస్తావన-

"ఉమాపతి మొన్న రాసిన లెటర్‌లో నిన్ను అడిగాడు- నీ పెళ్ళికి రాలేకపోయినందుకు చాలా బాధపడ్డాడు!"

"అల్లుడూ! ఉమాపతికి ఉత్పల అంటే చాలా మమకారం. ఆమెను చూసి ఎంతగానో పొంగిపోయేవాడు. ఆమె సంతోషాన్ని తన సంతోషంగా భావించేవాడు!"

శరత్‌చంద్రలో ఆవేశం పెల్లుబికింది.

తన భార్య ఆరాధించే ఆ యువకుడు ఎంత అదృష్టవంతుడు?!

సాధారణంగా ప్రతి స్త్రీగాని, పురుషుడు గానీ పెళ్ళికి ముందు వ్యవహారాల్ని ఎట్టి పరిస్థితిలోనూ పైకిచెప్పకుండా రాజీపడి మనసులోనే ఆ జ్ఞాపకాల్ని సమాధి చేస్తూ ఉంటారు. అలా చేయని పక్షంలో వింతవింత సమస్యల్ని కొనితెచ్చుకున్న వారవుతారు. కానీ ఉత్పల?! అతన్ని ఎప్పుడూ హైలైట్ చేసి మాట్లాడుతుంది... అతను లేనిదే తన జీవితం లేనట్లు, అతను తన ప్రాణమన్నట్లు! ఆమె మాటలు వింటుంటే అతను చాలా మంచివాడు, అందగాడు, ఉన్నతుడు అనిపిస్తోంది శరత్‌చంద్రకు.

తన భార్య మెచ్చుకునే అతన్ని ఒకసారి చూడాలనిపించింది తనకు.

● ● ●

"ఇతనేనండీ... మా ఉమాపతి! ఉమా... మా పెళ్ళికి రాలేదు కదూ- మీట్ మై హజ్బెండ్... శరత్‌చంద్ర!"

ఉమాపతిని చూసిన శరత్‌చంద్ర అవాక్కయిపోయాడు.

'ఇతని గురించేనా- తన భార్య ఎంతో గొప్పగా చెప్పేది?'

అతని నడక, రూపం, మాటతీరు చూస్తే- 'మనుషుల్లో మరీ ఇంత అందవికారులు, కురూపులు ఉంటారా?' అనిపించి శరత్‌చంద్ర మనసు బాధపడింది.

చీకటిలో నిలబడితే మనిషి కనిపించనంతటి నలుపు ఛాయ, కుంటి నడక, అంగవైకల్యపు చేతులు, చెదిరిన జుట్టు, మాసిన గెడ్డం, చికాకు గొలిపే కనుముక్కు తీరులతో చాలా వికృతంగా కనిపిస్తున్నాడు.

శరత్‌చంద్రకు ఎందుకో 'పదహారేళ్ల వయసు' సినిమాలో చంద్రమోహన్ గుర్తుకువచ్చాడు.

"నమస్కారమండీ! దశరథరామయ్యగారు నాకు దారి చూపించిన దేవుడు. వాళ్ళబ్బాయి బాలాజీ నాకు క్లాస్‌మేట్. ఇక ఉత్పల... మా బంగారు తల్లి, మా అందరి గారాలపట్టి! నాకు ఈమధ్యన 'ఫిజికల్లీ హ్యాండీకాప్డ్' రిజర్వేషన్ కోటాలో బ్యాంక్‌ఉద్యోగం వచ్చింది. పోస్టింగ్ కలకత్తా. దూరం కావడంతో సెలవు వీలుకాక మీ పెళ్ళికి రాలేకపోయాను. ఈమెను బాధ, బరువు అనేవి తెలియకుండా చాలా అపురూపంగా పెంచుకుని మీ చేతుల్లో పెట్టాం. మీరు చాలా మంచివారు. మా అమ్మాయికి ఒక భర్తగా మంచిజీవితాన్ని ఇస్తారని మా కోరిక!"

- తన చేతులు పట్టుకుని ప్రాధేయపడుతున్న ఉమాపతి మనసులోని ఆర్తిని చూసి చలించిపోయాడు శరత్‌చంద్ర.

అతని సంస్కారాన్ని చూసి సిగ్గుతో కుచించుకుపోయాడు. స్వార్థం, సంకుచితత్వాల కలీతమైన ఉమాపతి వ్యక్తిత్వం ముందు, దృఢమైన అతని సంస్కారం ముందు తాను చాలా చిన్నవాడుగా అనిపించింది- అతని అంగవైకల్యం చాలా చిన్నవిషయంగా తోచింది.

తను ఉత్పలని ఎంత అపార్థం చేసుకున్నాడు?

అవివేకంతో లేనిపోనివి విపరీతంగా ఊహించుకుని భార్యపై అపోహలు ఏర్పరచుకున్నాడు. ఉమాపతి ఎంత మంచివాడు! అందుకే అతని బాహ్యరూపాన్ని పట్టించుకోకుండా అంతఃసౌందర్యాన్ని ఉత్పల మెచ్చుకునేది. అసలు తమ బలహీనతను నొక్కిపట్టి పైకి కృత్రిమంగా నవ్వుతూ కన్పించే జనావళి మధ్య తన భార్య ఎంత ఉన్నతురాలు?! మనసులో ఏమీ దాచుకోకుండా, కల్మషం అనేది లేకుండా అంతా పైకి చెప్పేసే బోళామనిషి ఆమె! అటువంటి ఆమెను తను అపార్థం చేసుకుని ఆ ఇద్దరి మధ్య 'ఏదో' ఉందని విపరీతంగా ఊహించుకున్నాడు.

"మా ఉమాపతితో మాట్లాడుతూ ఉండండి. వంట క్షణంలో రెడీ చేస్తాను!"

• • •

"అది సరే! అతను అటువంటి లోపం కలవాడని నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు?"

"నాకు నచ్చిన వ్యక్తుల లోపాల్ని నోటితో చెప్పడానికి నా మనసు అంగీకరించదు. ఉదాహరణకు మీ విషయాన్నే తీసుకోండి- మీరు నా భర్త! మిమ్మల్ని ప్రేమిస్తాను, గౌరవిస్తాను, ఆరాధిస్తాను. మీరంటే చాలా ఇష్టం. కాని, గతంలో మాకు సహాయపడిన ఉమాపతిని గురించి చెప్తోంటే మీరు చాలా అసహనానికి గురవడం నేను గమనిస్తూనే ఉండేదాన్ని. కానీ, మీరే ఈ విషయం గ్రహిస్తారని మిమ్మల్నీ, మీ బలహీనతనీ నేను ఎప్పుడూ నా నోటితో మీకు చెప్పలేదు!"

భార్య మనసు అర్థంచేసుకున్న శరత్‌చంద్ర అపురూపంగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. అలా తీసుకోవడంలో ఆమె పట్ల అతనిలోని ప్రేమ, అభిమానం, అనురాగం, వాత్సల్యం... స్పష్టంగా వ్యక్తమయ్యాయి.